# హృదయ సుగంధం

వావికొలను రాజ్యలక్ష్మి



# హృదయ సుగంధం

న వ ల

**వావిలికొలను రాజ్యలక్ష్మి**

**సూర్య ప్రచురణలు**

హైదరాబాదు

**Hrudaya Sugandham**

A Novel

**by V. Rajyalakshmi**

© V. Rajyalaksmi

First Edition : 2012

Price : ` 80/-

*For Copies:*

**Mrs. V. Rajyalakshmi**

S.V. Nilayam

Plot No. 28/B. Flat No. G-2

Prabhat Nagar Colony, Chaitanyapuri

Hyderabad-500 060

Ph: 040-2405 3455, Cell:9347 755 885

E-mail: rajyam2005@yahoo.co.in

&

**All leading Book Shops**

*Book Production:*

*'Pustakashilpi'*

**T.Muralidhar Gowd**

Cell: 9393 176 552

E-mail: tmgowd@gmail.com

*Cover Design:*

**Swapna**

*DTP:*

**Literacy House**

Andhra Mahila Sabha, O.U. Road

Hyderabad-500 007

Ph: 040- 2709 8406

*Published by:*

**Surya Prachuranalu**

37/207 Ramamohan Towers

Huda Complex, Saroornagar

Hyderabad- 500 035; Ph 040-2404 7889

*Printed at:*

**Karshak Art Printers**

Multicolour Printers & Designers

40-APHB, Vidyanagar,

Hyderabad-500 044

Ph: 040 - 2761 8261.

# నా మాట

ఇంతకు ముందు నా రెండు పుస్తకాలు ప్రేమపుష్పం (నవల), బ్రహ్మలిఖితం (కథల సంపుటి) – ప్రచురించిన "పుస్తక శిల్పి" శ్రీ తాళ్లపల్లి మురళీధరగౌడుగారే ఈ నవలను కూడా ప్రత్యేక శ్రద్ధతో ప్రచురించి, వెలుగులోకి తెస్తున్నందుకు ముందుగా ధన్యవాదాలు.

ఈ నవలను ఆంధ్రభూమి మాసపత్రికలో ప్రచురించిన సంపాదకులు శ్రీమతి ఎ.ఎస్. లక్ష్మిగారికి కృతజ్ఞతలు.

డిటిపి చేసిన లిటరసీహౌస్, ఆంధ్ర మహిళాసభ వారికి, చక్కటి ముఖచిత్రాన్ని రూపొందించిన చిత్రకారులు శ్రీ స్వప్నగారికి, సకాలంలో అందంగా అచ్చువేసిన కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్ వారికి ధన్యవాదాలు.

పుస్తకంలో ప్రచురించేందుకు ప్రభుత్వ ప్రకటన విడుదలచేసి ప్రోత్సహించిన ఆం.ప్ర. సమాచార పౌర సంబంధాల శాఖవారికీ నా నమస్సులు.

**రాజ్యలక్ష్మి**

# హృదయ సుగంధం

**సూ**ర్య భగవానుడు మబ్బుల మాటున దాగుడు మూతలు ఆడ్డం వలన కాస్తా నీరెండగా ఉందా సమయం, చల్లని పిల్లగాలులు రివ్వున వీస్తున్న ఆహ్లాదకరమైన వాతావరణంలో తల్లీపిల్లలు తోటపనికి ఉపక్రమించారు.

చిట్టి చిట్టి చేతులతో చిన్న మగ్గుతో నీళ్లు తీసుకెళ్ళుతూ చెట్లను తడుపుతూ, మధ్య మధ్య జారిపోతున్న నిక్కరును ఓ చేత్తో పైకి లాగి లాక్కుంటూ కన్న పడుతున్న అవస్థని ఓరకంట చిరు నవ్వు ముఖంతో గమనిస్తూంది పరిమళ.

అటువైపు చెట్లకి నీళ్లు పోస్తున్న రవి "అమ్మా! ఈ మిరప చెట్టన్నింటికీ నిండుగా పూత వచ్చేసింది" సంతోషంతో అరుస్తున్నట్లుగా బిగ్గరగా అన్నాడు తల్లితో.

"అవును! నేను నిన్ననే చూశాను...." బీర, కాకర, సొర, పొట్ల చెట్లకి పాదుల్ని చిన్న గునపంతో విశాలం చేస్తూ పేడ ఎరువు వేస్తున్నామె కొడుక్కి సమాధానంగా అంది.

"అమ్మా! ఇంకా నీ చెట్లకి పోయాలి నీళ్లు?" అలిసిపోయిన వాడిలా నడ్డిమీద రెండు చేతులూ పెట్టుకొని తల్లివంక తేరిపారగా చూస్తున్నాడు కన్న.

"ఇందాకట్నుంచీ చూస్తున్నాను. ఎందుకురా కన్నా, అటూ ఇటూ తెగ తిరిగి అలసిపోతున్నావ్? ఆ తర్వాత కాళ్లు బాగా నొప్పెడుతాయిరా! నీవెళ్ళి ఆ మల్లెచెట్టు పందిరి కింద మంచంపై కూర్చో. నేను అన్నయ్య ఇద్దరం కల్సి పోస్తాములే చెట్లకి నీళ్లు"

"ఉహూ...కూచోను. నేను పోతా చెట్లకి నీళ్లు హన్నయ్యలా..."

"సరే! నీ ఇష్టమిక!" నవ్విందామె.

ఇంతట్లో బయట వాకిట్లో సైకిల్ బెల్ గణగణా మోగింది. అది వినగానే కన్న చేతిలోని మగ్గుని క్రిందపడేసి "పోస్తు తాతా! పోస్తు తాతా!..." అని హుషారుగా అరుచుకుంటూ రివ్వున బయటికి పరిగెత్తుతాడు.

"పోస్ట్ బాబాయ్ వచ్చాడులా ఉంది రవీ! నేవెళ్లి చూసివస్తాను, మిగిలిన చెట్లకి నేను పైపుతో నీళ్లు పడ్తాను. నీవెళ్లి కాస్తా రెస్టు తీసుకొని చదువుకో" పెద్ద కొడుక్కి చెప్తూ, పక్కన్నే ఉన్న నీళ్ళ బకెట్‌లో రెండు చేతుల్ని ముంచి శుభ్రంగా కడుక్కొని పైట చెంగుతో తుడుచుకుంటూ లేచి చీర కుచ్చెళ్లని కిందకి లాక్కుంది. ఓమారు జుత్తుని సవరించుకుంటూ

పెరట్లో నుంచి ఇంట్లోకి వచ్చింది పరిమళ.

అప్పటికే పోస్ట్‌మాన్ వెంకన్న కవరేదో కన్నకిచ్చాడులా ఉంది. వాడది పట్టుకొచ్చి సంతోషంగా వాళ్లమ్మకిస్తూ "హమ్మమ్మ నాకోచం లాచింది చదువు" తల్లి చీర కుచ్చెళ్ళని పట్టుకొని ముద్దు ముద్దుగా అన్నాడు.

"ఇది అమ్మమ్మ రాసింది కాదురా కన్నా! మీ నాన్నగారికి బ్యాంక్‌వాళ్లు పంపించిన లెటరిది"

"మరే, హమ్మమ్మ ఎందుకు రాయలేదు?"

"ఏమో? ఎందుకు రాయలేదో?...ఫోన్ చేసి తర్వాత అడుగుదాములే.." కొడుక్కి నచ్చజెప్పుతూ నవ్విందామె.

"గార్డెన్ పని చేస్తున్నావా అమ్మా?" అంటూ బయటి వాకిట్లో సైకిల్‌కి స్టాండ్ వేస్తున్న వెంకన్నను చూస్తూ "అవును బాబాయ్! రండి లోపలికి..." సాదరంగా చిరునవ్వు ముఖంతో ఆహ్వానించింది.

ఈలోగా కన్న వంటింట్లోకెళ్లి కుండలో నుంచి చల్లటి నీళ్లు తెచ్చిన గ్లాసును వెంకన్న కందిస్తూ "తాగు తాతా!" అన్నాడు ఆప్యాయంగా.

"మా నాన్నే! మాకన్నే!" నవ్వుతూ కన్నవైపు మురిపెంగా చూస్తూ గ్లాసందుకొని గటాగటా తాగాడాయన.

ఇంట్లో పరిమళ వున్నా లేకున్నా ఇంటికొచ్చి అతిథులకు మంచినీళ్ళిచ్చి బాగానే సత్కరిస్తారా పిల్లలు మర్యాదగా.

ఆ మంచి అలవాటు పిల్లలకు తల్లే నేర్పింది.

"పిన్ని ఆరోగ్యమిప్పుడు ఎలా వుంది బాబాయ్?" బంధుత్వం, చుట్టరికాలు ఏమీ లేకపోయినా కల్సిన వాళ్ళని కమ్మగా, వీనుల విందుగా వరసలు కట్టి ఆప్యాయంగా పిలవడం పరిమళకు మొదటినుంచీ అలవాటైన విషయమే.

"మీ పిన్ని ఆరోగ్యమిప్పుడు ఫర్వాలేదు. బాగానే ఉందమ్మా?"

"కన్న కొడుకు రఘు విషయంలో పిన్ని మనస్సుకైన ఆ గాయం, ఆ దు:ఖం మానాలంటే ఇంకా కొన్నాళ్లు పడుతుంది. బాబాయ్! మీరు బయట తిరుగుతారు. ఉద్యోగం పేరిట పది మందిని కలుస్తుంటారు. కాబట్టి, మీరు కాస్తా తట్టుకోగలిగారు. కానీ, పిన్ని అలా కాదే...! ఆ ఇంట్లో నాలుగ్గోడల మధ్య ఒంటరిగా ఉంటూ అనుక్షణం కన్నవాడిని తల్చుకుంటూ దు:ఖిస్తూ ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటూ ఉంటుంది. కాలమే ఆమెలో మార్పు తెస్తుంది. మరుపనేది భగవంతుడు మనకిచ్చిన గొప్ప వరంలాంటిది బాబాయ్! ఏదో ఒకనాడు ఆ దు:ఖస్రవంతిలో నుంచి తేరుకుంటుంది లెండి!"

"ఏం తేరుకుంటుందో ఏమో! నాకేం అర్థం కావడం లేదమ్మా! అనుక్షణం వాడి జ్ఞాపకాలతోనే కొట్టుమిట్టాడుతుంటుంది. ఆ విధాత మాకీ వయస్సులో ఎందుకీ దు:ఖాన్ని కష్టాన్ని కల్గించాడో?" బరువుగా నిట్టూరుస్తూ బాధాతప్త స్వరంతో అంటున్న ఆయన కళ్లల్లో నీళ్లు నిండాయి.

"కష్టాలనేవి మూడు రకాలుగా మనుష్యులకు కల్గుతుంటాయని మన పెద్దలు ఎప్పుడో చెప్పారు బాబాయ్! మొదటి రకం కష్టాలు మనిషి చేసుకున్న స్వయంకృత అపరాధాలు! అంటే మనంతట మనమే కొని తెచ్చుకునేవి. ఇక రెండోరకం కష్టాలు పరాకృత అపరాధాలు! అంటే....ఇవి సమాజంలో మన చుట్టూ ఉన్న ఇతరుల నుంచి మనకు కలిగేవన్నమాట. ముచ్చటగా మూడోరకం కష్టాలు... మనిషి యొక్క గత జన్మకు చెందిన అవశేషాలని అంటారు. అంటే కర్మఫలాలు. ఇప్పుడు మీకు వచ్చినది రెండో రకానికి చెందినది. కష్టాలనేవి తెప్పించే దు:ఖం కనురెప్ప మాటున ఉప్పెనలా ఆగిపోవాలేగాని, ఆ కన్నీళ్ళనే దు:ఖ సముద్రంగా మార్చుకోగూడదు. లేనిచో దు:ఖపూరితమైన ఆ ఆలోచనల వలన మనిషి జీవితం ఆ కడలి కెరటాల సుడిగుండాల్లో కొట్టుకెళ్లే ప్రమాదముంది బాబాయ్! పిన్నిని అలా ఒంటరిగా వదిలేయకుండా అప్పుడప్పుడు మా ఇంటికి తీసుకొస్తుండండి... పిల్లలతో కాస్త గడుపుతుంటే మనస్సు కుదుటపడుతుంది.

"చాలా బాగా చెప్పావమ్మా. ఉత్తమగుణ మాధుర్యాలుగల సమున్నతమైన భావ సంపద నీలో మెండుగా ఉంది. నీవు దాన్ని వెలికి తీసి కాగితంపై పెట్టగూడదమ్మా?"

"అయ్యబాబోయ్! మీరు మరీను. నాపట్ల చాలా అతిశయోక్తిగా మాట్లాడుతున్నారు బాబాయ్! రచనా వ్యాసంగం చేసేంతటి ప్రతిభా పాటవాలు నాలో లేవు లెండి. ఏదో నేను చదివినవి...విన్నవి మంచి మాటలిలా చెప్తుంటానంతే..."

ఈమారు ఏం మాట్లాడలేదు వెంకన్న. తలవంచుకొని జేబులు తడుముకొని కొంత డబ్బు తీసి పరిమళకు అందించబోయాడు.

"ఏంటది బాబాయ్! ఎక్కడిదీ డబ్బు?"

"అదేనమ్మా. పోయిన నెల్లో నేతీసుకున్న డబ్బు!"

"అయ్యో బాబాయ్! అది మీరు మళ్లీ తిరిగివ్వాలా? నేను మీకు అప్పుగా ఇవ్వలేదు. ఉంచండి మీ-దగ్గరే. పిన్నికి మందులు కొనడానికి పనికొస్తాయి".

"అలా అంటే ఎలాగమ్మా? ఆనాడు అవసరానికి దేవతలా ఆదుకున్నావ్. తీసుకో తల్లీ!"

"ప్లీజ్! వద్దు బాబాయ్! ఆ డబ్బు మీ దగ్గరే ఉంచండి. నన్ను మీరు మరీ పరాయిదానిలా చూడొద్దు. నాకది చాలా బాధగా ఉంటుంది. మీ కన్నకూతురిలా భావించండి. మీరు

దేనికి మొహమాడపడొద్దు బాబాయ్! మీకేం అవసరం వచ్చినా, ఏం కావాలన్నా నన్నో, ప్రకాశ్‌నో ఏ మాత్రం సందేహించకుండా అడగండి”

“ఈ ఊళ్లో మాకందరికీ నీవో దేవతగా అనిపిస్తావ్. నీ మంచి తనం అలాంటిదమ్మా!”

“నా పట్ల మీకందరికీ అలాంటి భావన ఉండడం...నిజంగా నేను పూర్వజన్మలో ఏదో పుణ్యం చేసే ఉంటాను బాబాయ్” నిండు మనస్సుతో నవ్విందామె.

“బాధలతో ఉన్నవారిని ఆదుకొని అక్కున చేర్చుకుంటావ్? ఈ ఊరు ఇంతగా అభివృద్ధిపథంలో ముందుకు పోవడానికి ముఖ్య కారకురాలివి నీవే అంటూ ప్రతి ఒక్కరూ నిన్నే కొని యాడతారు తెలుసా?

“అది వాళ్లకు నాపై ఉన్న అభిమానం బాబాయ్! ఊరు ఇలా ఇంతగా అభివృద్ధి చెందడానికి నా ఒక్కదాని కృషే కారణం కాదు. మనందరి సమష్టి కృషే మూలం”

“నిండు కుండ తొణకదు అన్నట్లుగా, నీలాంటి సహనమూర్తులు అట్లాగే మాట్లాడుతారు పరిమళమ్మా! నేను నిజం చెప్తున్నాను. నీ పేరుకు తగినట్లుగానే మంచి గంధపు సువాసనలు వెదజల్లే చక్కటి మనస్సు నీదమ్మా! నీ మంచితనమనే పరిమళం ఇలాగే ఎప్పటికీ ఊరు ఊరంతా వ్యాపిస్తూనే ఉండాలి. ప్రతి ఊళ్లో నీలాంటి బంగారు తల్లి ఒక్కరంటే ఒక్కరున్నా చాలు! దేశమే బాగుపడుతుందని నా భావన...” మనస్ఫూర్తిగా అంటూ వెళుతున్న పోస్ట్ బాబాయ్‌ని కన్నార్పకుండా అభిమానంగా చూడసాగిందామె.

కరువుకాటకాలను, పేదరికాన్ని శ్రమతో కూడిన కష్టంతో ఆత్మవిశ్వాసంతో జయించవచ్చునేమోగాని, ఊరందరి జనుల మనస్సులో సుస్థిర స్థానం సంపాదించడమన్నది నిజంగా పరిమళ సాధించిన అద్భుతమైన అపూర్వ విషయమనే చెప్పాలి.

✧ ✧ ✧

ప్రకాశ్ చిన్నప్పటినుంచీ పల్లెటూరిలోనే పుట్టి పెరిగాడు.

డిగ్రీ, పీజీ హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బి.యిడి. వరకు చేసి, డిఎస్సీ రాసి ర్యాంకు తెచ్చుకొని స్కూల్ అసిస్టెంట్‌గా గవర్నమెంట్ ఉద్యోగం సంపాదించాడు.

ప్రస్తుతమిప్పుడు తాముంటున్న ఊరికి సమీపంలోగల మరో ఊళ్లో జాబ్ చేస్తున్నాడు.

ప్రకాశ్ పరిమళకి స్వంత మేనత్త కొడుకే!

ఇద్దరూ మనస్ఫూర్తిగా ఇష్టపడి ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు.

పరిమళ కూడా అతనికి సమానంగా చదివి ప్రస్తుతం తానున్న ఊళ్లోనే ప్రాథమిక స్కూల్లో హెడ్‌మిస్ట్రెస్‌గా పని చేస్తుంది.

బడిలోని పిల్లలకు, వాళ్ల తల్లిదండ్రులకు పరిమళ వాక్కంటే వేదవాక్కు అనే చెప్పాలి. ఆమె మాటంటే అంత గురన్నమాట. ఓపక్క ఉద్యోగం చేస్తూనే మరోపక్క ఖాళీ సమయాలలో ఆ ఊరి అభివృద్ధికోసం జరిగే ఎన్నెన్నో మంచి మంచి కార్యక్రమాలలో పాల్గొంటుంది, చక్కటి సలహాలిస్తుంది.

ఆ ఊరి సర్పంచ్ సరస్వతమ్మకి కూడా పరిమళంటే అంతులేని అభిమానం, ఎనలేని ప్రేమానురాగాలు...పంచ ప్రాణాలూను.

గ్రామపంచాయితీ కార్యాలయ ఆవరణంలో నెలకొక్కసారి జరిగే స్త్రీల సభలకి అందరూ కల్సికట్టుగా వస్తారు. మహిళామణుల స్వయం సంఘాల ప్రతినిధులతో సభంతా కన్నుల పండుగగా కళకళలాడుతుంటుంది.

మండలాధ్యక్షుని ముఖ్య అతిథిగా ఆహ్వానించి ఆయన సమక్షంలోనే ఊరి బాగోగులను గురించి చర్చించుకొని, ఏదో ఒక మంచి కార్యక్రమం అమలు జరిగేలా శీఘ్రంగా చర్యలు తీసుకుంటారు.

అది అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుంది.

✧ ✧ ✧

ఆరోజు గురువారం

రోజుకన్నా ఆరోజు పూజా కార్యక్రమాలు ఇంకాస్త ఎక్కువే ఉంటాయి. జయప్రదకు. మామూలు పూజా విధానంతో పాటు శ్రీసాయినాథుని అష్టోత్తర శతనామావళి, సాయి చాలీసా, భజన కీర్తనలు కొన్ని పాడి...మంగళహారతులు అన్నీ పూర్తై కర్పూర హారతిని కళ్లకద్దుకొని ఊది చిటికెడు తీసుకొని 'పరమ పవిత్రం బాబా విభూతి...' అని శ్లోకం చెప్పుకుంటూ ప్రసాదంగా నోట్లో వేసుకొని మిగిలినది అదే చేత్తో నుదుటిపై అడ్డంగా బొట్టులా రుద్దుకుంది భక్తిభావంతో.

ఇంతట్లో హాల్లో ఉన్న ఫోన్ గణగణా మోగింది.

భర్త తీస్తాడు లెమ్మని ఓక్షణం అవి ఇవీ సర్దుతూ పూజాగదిలోనే ఉండి పోయిందామె. ఎంతకీ ఫోన్ ఎవరెత్తే సూచనలు కనబడపోయేసరికి తానే పరుగులాంటి నడకతో గబగబా వచ్చి ఫోనెత్తింది.

"హలో ఎవరు?"

"ఆఁ, నేనే జయా! అంతా బాగే కదా?"

"మీరా వదినగారూ! ఎలా ఉన్నారు?"

“ఎలా ఉంటాను? ఆ ఏదో ఇదిగో ఇలా ఉన్నాను.”

‘‘ఎందుకొదినగారూ! మీరెప్పుడూ ఏదో నిరాశతో బాధగా మాట్లాడుతారు...మీకిప్పుడు ఏం కష్టం వచ్చింది? హాయిగా కొడుకు కోడలి దగ్గరికెళ్లి ఉండక...ఇంకా ఎందుకా ఊళ్లో ఒంటరిగా బిక్కు బిక్కుమంటూ ఉంటారు?”

“నా సంగతి నీకు తెల్సుగా జయా? నేను ఎవరి అధీనంలో ఉండలేను. నా అంతట నేను స్వతంత్రంగానే ఉండాలని కోరు కుంటాను”.

“కాలం శరవేగంతో మారిపోతుంది. కాలంతోపాటు మనమూ మారాలి వదినగారూ! ఏం చెప్పినా మీరు మాత్రం అర్థం చేసుకోరు”.

“వాడు లేడా? ఓసారి నాతో మాట్లాడించు” మాట మార్చిందావిడ.

“ఎవరు? మీ తమ్ముడుగారా? ఇందాకటి వరకిక్కడే ఉన్నారు. ఇంతట్లోనే ఎటు వెళ్ళారో తెలీదు. నిన్న మీతో మాట్లాడాలని రెండుసార్లు ఫోన్ చేశారు. మీరేమో ఇంట్లో లేరట. గుడి కెళ్ళారని పద్దు చెప్పిందట”.

“అవును. గుడి కెళ్ళాను. కాస్తా కాలక్షేపంలా ఉంటుందని. అప్పుడప్పుడూ ఇంటిముందున్న రామాలయానికి వెళుతుంటాను”.

“వెళ్లండి...మంచిదే! ఈ వయస్సులో కాకపోతే గుళ్లు గోపురాలు ఇంకెప్పుడు దర్శించుకుంటాం?”

“నాలో ఇప్పుడు ఏ ఆశలు, కోరికలు లేవుగాని, రోగం రొష్టు బారిన పడకుండా, మంచానబడకుండా, ఎవరి అధీనంలోను వాళ్ళ దయాదాక్షిణ్యాలపై ఆధారపడకుండా కాళ్లు చేతులు స్వాధీనంలో ఉన్నప్పుడే పువ్వులా రాలిపోవాలని ఉంది జయా! మరి ఆ సర్వేశ్వరుని దయ నాపై ఎలా ఉందో?”

“సర్వేశ్వరుడంటే గుర్తొచ్చింది వదినగారూ! విశ్వేశ్వరుడి దగ్గరికెళ్ళుదాం. వస్తారా మీరు?”

“అమ్మో...కాశీకా? ఈ వయస్సులో నేనంత దూరం ప్రయాణం చేయగలనంటావా?”

“మరీ అంతలా భయపడకండి వదినగారూ! మీకన్న ఎక్కువ వయస్సున్న వాళ్ళే... ఒక్కొక్కళ్ళూ అమెరికాలాంటి దేశాలకే సునాయాసంగా వెళ్ళి వస్తున్నారీ రోజుల్లో. మీ వెంట మేమంతా ఉండమా ఏమిటి?”

“ఎప్పుడు వెళ్దామనుకుంటాన్నారేమిటి?”

“ఏదీ, ఇంకా ఆలోచనల్లోనే ఉంది వ్యవహారం. ఉత్తరదేశ యాత్ర....కాశీ, ప్రయాగ, గయ, హర్ద్వార్, ఋషికేష్, నైమిశారణ్యం, అయోధ్య, నేపాల్ వరకూ వెళ్లాలని మీ తమ్ముడి ప్లాన్”

"నేపాల్ అంటే అది వేరే దేశం కదా జయా?"

"ఇప్పుడు వేరే దేశం కానీ, ఒకప్పుడు నేపాల్ కూడా మనదేశంలోని భాగమేనట. సీతమ్మవారి పుట్టిల్లు మిథిలానగరం అక్కడేనట ఉండేది. మీ తమ్ముడు రిటైర్‌మెంట్ అయినప్పటినుంచి ఉత్తరదేశ యాత్ర వెళ్ళాలంటూ పలువరిస్తూనే ఉన్నారు. కానీ ఏదీ...అదింతవరకూ అమలు కావడం లేదు"

"సరే, వాడొచ్చాక నాకోసారి ఫోన్‌చేసి మాట్లాడమని చెప్పు" అంటూ అవతలివైపు నుంచి అనేసరికి "మంచిది వదినగారూ! అలాగే ఫోన్ చేయిస్తాను" అంటూ జయప్రద ఫోన్ పెట్టేసింది.

అప్పుడే పెరట్లో నుంచి శ్రీనివాసరావు లోపలికొచ్చాడు.

"మీరింట్లోనే ఉన్నారా? ఇందాకనే సుందరమ్మ వదినగారు ఫోన్ చేశారు మీగురించే. ఓసారి మాట్లాడండి ఫోన్ చేసి ఆవిడతో..." భర్తకు చెప్పింది.

"ఏమిటట విషయం?" తాపీగా అడిగాడాయన.

"ఏముంటాయ్ విషయాలు? మామూలు సంగతులే! మన ఉత్తరదేశ యాత్ర గురించి చెప్పాను".

"ఏముంది? మరి వస్తానని అందా యాత్రలకి?"

"ఏం చెప్పలేదు. ఆ సంగతేదో మీరే మాట్లాడి కనుక్కోండి. నాపెళ్లి అయినప్పటినుంచి చూస్తున్నాను వదినగార్ని. ఎప్పుడు మాట్లాడినా ఆ మాటల్లో నిగూఢంగా దాగివున్న ఏదో తెలియని నిరాశ, నిర్లిప్తత, బాధ వేదన! అన్నీ వుండి అల్లుడి నోట్లో శని అన్నట్లుగా కొడుకు కోడలి దగ్గరికెళ్లి, ముత్యాల్లాంటి ఇద్దరి మనుమలతో కలిసి మెలసి హాయిగా ఆనందంగా ఉండక, ఎందుకా పల్లెలో ఎడారిలాంటి ఒంటరి బతుకు? ఇలాంటి మాటలు చెప్తే... ఉహూ...ఆవిడకు రుచించవు. అస్సలు ఆవిడ మనస్తత్వమేమిటో నాకంతు పట్టదు".

"తోడ బుట్టినవాడిని నేనే మా అక్కని అర్థం చేసుకోలేక పోతుంటాను. ఇక నీవెంత?"

"సర్లెండి...ముందుగా మీ అక్కగారితో మాట్లాడండి. ఆవిడకు మీతో ఒక్కరోజు కూడా మాట్లాడకుండా ఉంటే తోచదుగా?"

"మరేమనుకున్నావ్..మా అక్కా తమ్ముడి అన్యోన్య అనుబంధం ఎలాంటిదో నీకేం తెలుసు?" అని నవ్వుతూ అక్కకు ఫోన్ కలపడాన్కి నంబర్లు నొక్కసాగాడు శ్రీనివాసరావు.

✧ ✧ ✧

పరిమళ వాళ్లుంటున్న ఊరు కోనసీమ అందాలకు ఏమాత్రం తీసిపోనట్లుగా ఉంటుంది. ఒకవైపు అరటి, కొబ్బరి తోటలు! మరోవైపు పురాతన కాలంనాటి నిలువెత్తు గాలిగోపురంతో....ఎత్తైన ప్రాకారాలతో ఉన్న శ్రీవేణుగోపాలస్వామి ఆలయముంది. ఎటు

చూసినా పచ్చని పంట చేలతో కళ కళలాడుతుంది.

ప్రజలందరూ సమష్టిగా చందాలేసుకుని ఊరి మధ్యలో కొత్తగా పాలరాతితో నిర్మించిన శ్రీ షిర్డీ సాయిబాబా గుడి బహుసుందరంగా వుంది. ఆ పక్కనే విశాలమైన ధ్యానమందిరముంది.

ఈశాన్యం మూలన ఎప్పుడూ నిరంతరం నిండుగా పారే అతి పెద్దదైన గుండమ్మ చెరువు ఆ ఊరికే ముఖ్యాకర్షణ! వర్షాకాలంలో ఆ చెరువు నిండిందంటే చాలు... పంట పొలాలకు నీరు పుష్కలంగా లభిస్తుంది.

రైతులు భూసార పరీక్షలు చేయించి ఏయే పంటలు ఎప్పుడెప్పుడు వేయాలో వ్యవసాయ అధికారుల సలహాలు పాటిస్తూ పండిస్తారు. ముఖ్యంగా వరి, వేరుశనగ, పప్పు ధాన్యాలు, ఉల్లి ఎక్కువగా పండిస్తారు.

ఈమధ్య పరిమళ ప్రతి ఇంటిముందు ఖాళీ స్థలంలో కంటికి ఆహ్లాదం కల్గించేలా కళ కళలాడే రంగురంగుల పూలమొక్కలు..ఇంటి వెనకాల పెరట్లో ఆకు కూరలు, కూరగాయ పాదులు తప్పనిసరిగా పెట్టి, మనకు కావల్సిన కూరగాయల్ని మనమే పండించుకోవాలి. బయటి నుంచి కూరగాయలు మన ఊళ్లోకి రాకూడదు. ఇదే ఆమె నినాదం.

ముందుగా తాను ఆచరణయోగ్యంగా చేసి చూపించింది. ప్రస్తుతమిప్పుడు ఖాళీ స్థలాలు ఉన్నవాళ్లు అక్షరాల అరవైశాతం వరకు దాన్ని అమలు జరుపుతున్నారు. సన్నకారు రైతులు కూడా కొందరు తమకున్న కొద్దిపాటి భూముల్లో బోర్ వెల్స్ ద్వారా సేంద్రీయ ఎరువులతో కూరగాయల్ని పుష్కలంగా పండిస్తున్నారు.

స్కూల్ పిల్లలెలాగో ప్రాథమిక శిక్షణ ద్వారా మొక్కలు నాటే పనికి తమవంతు కృషి చేస్తూనే ఉన్నారు.

ఆ వూరికి కనీస అవసరాలైన మరుగుదొడ్లు, మంచినీళ్లు, శుభ్రమైన రోడ్లు కిరువైపులా ఏపుగా పెరిగిన పచ్చటి చెట్లూ, ఓ డాక్టర్, నర్స్, కాంపౌండర్‌తోపాటు ఇరవై పడకల హాస్పిటల్, గ్రామీణ బ్యాంక్, జూనియర్ కాలేజీ, చిన్న గ్రంథాలయం, చుట్టుపక్కల ఊళ్లకి రాకపోకలకు అనువుగా బస్సు సౌకర్యం ఇత్యాది వనరులన్నీ త్వరితగతిన సమకూర్చుకోవడం ఆ ఊరి వాళ్ల సమష్టి కృషే మూలకారణం.

ఊరికి కిలోమీటర్ దూరంలో రైల్వే స్టేషన్ కూడా ఇరవై ఏళ్ల నుంచే ఉంది. ఎక్స్‌ప్రెస్‌ల దగ్గరనుంచీ అన్ని రైళు ఆగుతాయి ఆ స్టేషన్‌లో.

ఊరిని బాగు చేయడమంటే మొక్కలు నాటడం, ఎత్తైన కార్యాలయ భవనాలు కట్టుకోవడం, తారు రోడ్లు వేసుకోవడమే కాదు... వీటన్నింటికన్నా ముఖ్యమైనది మనుష్యుల మనస్సుల్ని మరమ్మత్తు చేయాలని భావించిందామె.

ముందుగా నిరక్షరాస్యతను రూపుమాపితే...ఊళ్లో ఇంకా ఈనాటికి కూడ వేళ్ళు పాదుకొని ఉన్న కొన్ని రకాల మూఢ నమ్మకాలతోపాటు, మరెన్నో ఇతర సమస్యలకు కూడా పరిష్కారం లభిస్తుందని అన్ని విధాలా ఆలోచించి, రెండేళ్లనుంచి వయోజన విద్యా కేంద్రాన్ని ప్రారంభించి దాని బరువు బాధ్యతలను ఔత్సాహికులైన యువతకు అప్పగించింది.

దాన్ని ఆ యువకులు ప్రయత్నలోపం లేకుండా ద్విగుణీకృతంగా నిర్వహిస్తూ పరిమళ మెప్పు పొందారు.

అప్పుడప్పుడు రాత్రిపూట తీరిక చేసుకొని పరిమళా ప్రకాశ్‌లు వెళుతూ దాని పర్యవేక్షణ చేస్తుంటారు.

బానిస యజమాని అన్న అహంభావం లేదు, అంటరానితనం లేదు, ఈర్ష్యాద్వేషాలు అస్సలే లేవు...అంతరాలు లేని మనుష్యుల మధ్య పరస్పర సహాయ సహకారాలతో నూతనోత్సాహాలతో ముందుకు దూసుకుపోతున్నారు ఆ ఊరి ప్రజలు.

అదెంతో ఆనందదాయకంగా ఉంది వాళ్లకి.

స్వయం సమృద్ధి సాధిస్తేనే పల్లెలు బాగుపడతాయనీ, పల్లెలు పచ్చగా కళకళలాడుతుంటేనే దేశం అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడుస్తుందనీ అందరి మేధావులలాగే పరిమళా ప్రకాశ్‌ల భావన కూడాను.

✧ ✧ ✧

ఉషోదయం కావస్తోంది.

పెరట్లోని చెట్లపై పక్షుల కిలకిల రావాలు సుమధురంగా వినవస్తున్నాయి.

అప్పటికే స్నానాదికాలు ముగించుకున్న రాఘవమ్మ పూజా గదిలో నుంచి చిన్న స్వరంతో శ్రీవేంకటేశ్వరస్వామి సుప్రభాతాన్ని శ్రావ్యంగా చదువుతోంది లయబద్ధంగా.

అరమోడ్పుగా కన్నులు తెరిచి ఓమారు చుట్టూ చూసింది సరస్వతమ్మ.

మంచానికి అటువైపు మెడదాకా దుప్పటి కప్పుకొని భర్త రంగారావు ఆదమరచి హాయిగా నిద్రపోతున్నాడు.

ఇంతట్లో ఫోన్ మోగింది.

ఈవేళప్పుడు ఇంత ఉదయాన్నే ఫోన్ వచ్చిందంటే అది తప్పకుండా లండన్ నుంచే అయి ఉంటుంది.

అందరూ నిద్రకు ఉపక్రమించాక, అర్ధరాత్రి తీరుబాటుగా కూర్చొని ఓ అరగంటైనా కాత్యాయని తనతో మాట్లాడుతుంటుంది.

నిద్రపోకుండా ఉండే తన కూతురు మీన కూడ "అమ్మా! బాగున్నావా? నాన్న... నానమ్మ ఎలా ఉన్నారు? నీవు పరిమళ అంటీ ఇంకా సంఘసేవ ప్రజాసేవ అంటూ తిరుగుతూనే ఉన్నారా? రవీ...కన్న బాగున్నారు కదా? ప్రకాష్ అంకుల్ని ఆడిగినట్టు చెప్పు..." అంటూ గలగలా ప్రశ్నల వర్షం కురిపిస్తూనే ఉంటుంది.

దుప్పటి తొలగించుకుని మంచంపై నుంచి లేచిన సరస్వతమ్మ ఇవతలికి వచ్చి ఫోనెత్తి "హలో!" అంది ఆవులిస్తూనే.

"అక్కయ్యా! నేను కాత్యాయన్ని....నిద్ర లేచావా?"

"ఇదిగో...ఇప్పుడిప్పుడే లేస్తున్నాను. ఇంతట్లోనే నీ ఫోన్".

"మీ అత్తగారు ఎట్లా ఉన్నారు?"

"ఆవిడకేం? బాగానే ఉన్నారు. పూజ చేస్తున్నారు".

"ఇంత పొద్దున్నేనా?"

"ఆc. ఆవిడ రోజూ తెల్లవారుజామున నాల్గింటికే నిద్రలేస్తారు?"

"నీవెలా ఉన్నావ్ అక్కయ్యా?"

"బాగానే ఉన్నాం మేమంతాను. నీ గొంతేమిటి అలా డల్‌గా ఉంది? ఒంట్లో ఏమన్నా బాగాలేదా?" చెల్లెల్ని ఆత్రంగా అడిగిందామె.

"ఒంట్లో కాదక్కయ్యా! మనస్సులో బాగాలేదు!" బరువుగా నిట్టూర్పు విడిచింది.

"ఏం? ఎందుకు? ఏమైంది? ఏ విషయంలో..."

ఒక్కక్షణం నిశ్శబ్దం! దీర్ఘంగా నిట్టూర్చింది.

"హలో..."

"ఆc. వింటున్నాను చెప్పక్కయ్యా...."

"ఏం మాట్లాడకపోతే ఫోన్ పెట్టేశావేమోనని అనుకున్నాను"

"మీన విషయంలో నీకు కొన్ని విషయాలు చెప్పాలి. ఏం చెప్పాలో ఎలా చెప్పాలో నాకు తెలియడం లేదు..." ఏదో ఆలోచిస్తున్నట్లుగా నెమ్మదిగా అంది కాత్యాయని.

సరస్వతమ్మ గుండె...ఒక్కక్షణం ఉద్విగ్నతకు లోనైంది.

భయాందోళనలతో అదిరిపోయింది. ధైర్యం చిక్కబట్టుకుంది.

"మీనకేమైంది? త్వరగా చెప్పు? నా మనస్సేదో కీడు శంకిస్తుంది"

"నీవేం అనవసరంగా బాధ పడకు. మీనకు ఏం కాలేదు. బాగానే ఉంది. ప్రస్తుతం తన రూంలో హాయిగా నిదురపోతూంది"

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2456**

* * *